


నిద్రలో చప్పున మెలకువ వచ్చింది.

చుట్టూ చూచాను. చీకటి ... భయం వేస్తోంది "అమ్మా!" అని అమ్మను పిలుద్దా మనిపించింది. అమ్మయ్యో! ఇంకేమైనావుందా? నిద్ర పాడుచేశానని అమ్మ నాలుగు తంతుంది. "ఏమిట్రా వెధవా, గొడవ?" అంటూ నాన్నకూడా నన్నే కొడతారు. ప్చ! ఎందు కొచ్చిన గొడవ? కాస్సేపు ఆంజనేయస్వామిని తల్చుకుంటే భయం అదే పోతుందని నిన్న పక్కింటి పిన్నిగారు వాళ్ళబ్బాయికి చెబుతుంటే విన్నాను. అదే మంచిపని

కొకున్నా. అమ్మకూ నాన్నకూ నేనంటే ఎందుకో అంతకోపం? ఎందుకేమిటీ? నేను నల్లగా ఉన్నానట. నా

పళ్లు ఎత్తుగా అసహ్యంగా వున్నాయట. నాకు మెల్లకన్నుట. కోతిలా వుంటానట.

అమ్మ స్నేహితురాలొకావిడ వుంది. పేరు సావిత్రట. ఉట్టి చుప్పనాతి. లేకుంటే ఆవిడ కెందుకో నా వూసు! నేనెలావుంటే తనకేం? మా ఇంటి కొచ్చినప్పుడల్లా పనిగట్టుక అడుగుతుంది; "ఏమోయ్ కల్యాణీ! నువ్వు తెల్లగా చక్కగా వుంటావు. మీవారూ అందంగా హుందాగా వుంటారు. మీ సీనుగా దేవిటింత అసహ్యంగా వుంటాడూ?" అంటుం దమ్మతో, చెవులకు చేటల్లా వేలాడుతున్న అలోలక్కులు వూగులాడిస్తూ, నడినెత్తిన శిగతో తల తెగతిప్పుతూ!

తన కొడుకేమో అక్కడికి మహా బాగున్నట్లు! తెల్లగా పిండిబొమ్మల్లే, దొప్పచెవులూ, చట్టిముక్కూ. పిల్లి కళ్ళూ, బట్టతలా వాడూను...నేనే అమ్మనయితే ఆమాటే అడిగేద్దును. కాని అమ్మ అలా అనదే?

"ఏమో సావిత్రీ! ఈ కోతివెధవకు ఎవరి పోలి కొచ్చిందో అర్థంగావటం లేదు. మా పుట్టింటివేపుగానీ, మెట్టినింటి వేపుగాని ఇంత అనాకారపుజీవు లెవ్వరూ లేరు. వీడు పురిట్లో వుండగానే, వీడికి వాంతులు పుట్టాయి; పీడా వదిలిపోతుందనుకున్నాను. ఊహుఁ, రా యి లా వున్నాడు" అంటుం దమ్మ!

అన్నయ్య తెల్లగావుంటాడు; చెల్లాయి అందంగా వుంటుందట. వాళ్ళిద్దరిలా నేను లేనని అమ్మకూ, నాన్నకూ ఇద్దరికీ కోపమే!

"వీడు నా కొడుకని నలుగురితో ఎలా చెప్పుకోను కల్యాణీ?" అంటారు నాన్న నా వేపు చిరాకుగా చూస్తూ!

ఒకసారేం జరిగిందో తెలుసా?

అన్నయ్య పెన్ను బల్లమీద పెట్టి స్నానాని కెళ్లాడు. వాడికి మహాబడాయి. తనే మహాగొప్పగా హైస్కూల్లో ఫస్టు ఫారమ్ చదువుతున్నట్టూ, చాలా తెలివిగలవాడయినట్టూను. దానికితోడు అమ్మ నాన్నలుకూడా వాణ్ణి నెత్తినెక్కించుకుంటారు!

"బంగారునాయనకు చదు వెక్కువయింది. స్కూలు దూర మయింది. అంతదూరం వెళ్ళొచ్చేసరికి అలసిపోతున్నాడు రిక్షాఒకటి మాట్లాడుదామండీ!" అంది అమ్మ నాన్నతో.

"వెరీగుడ్ అల్లాగే!" అన్నారునాన్న.

మ రైతే బడీ మైలుదూర ముంది. నాలుగోక్లా సయితేమాత్రం నాకూ కాళ్ళ నొప్పెట్టడములేదూ? నేనూ అడిగేశాను. "నాక్కూడా రిక్షా కావాలి" అని.

"కోతివెధవ! నీ కదొక్కటే తక్కువ. బడికి వెళ్ళు కుదురుగా..." అమ్మ ఉరిమి చూసింది.

"కుళ్ళువెధవ, పక్కవాళ్ళ కేదివుంటే, తనకూ అదేకావాలనేతత్వం..." నాన్న చిరాకు చూ స్తుంటే, కొడతారేమో నని భయమేసి లోపలికి పరుగెత్తాను.

నేను కోతివెధవనూ, కుళ్ళువెధవనూనా ? అన్నయ్య బంగారునాయనా ? అన్నయ్య స్కూలు అరమైలైతే రిక్షా కావాలా ? నాబడి మైలుదూరముంటే, నేను నడిచే వెళ్ళాలా ?

అరె ! ఇదేమిటి ? పెన్ సంగతి చెబుతూ. మరేదో వాగేస్తున్నాను ! అఁ ! అన్నయ్య పెన్నెక్కడ పెట్టివెళ్ళాడా ? నే నీమధ్య ఇంగ్లీషు నేర్చుకుంటున్నాను కదూ ? అందుకని ఇంగ్లీషులో నా పేరు పుస్తకంమీద వ్రాసుకుందా మనిపించింది. ఎప్పు డొచ్చాడో అన్నయ్య "ఒరేయ్ శీనుగా ! నా పెన్నెందుకురా తీశావ్ ?" అన్నాడు ఇల్లెగిరిపోయేలా.

"ఏమోయ్ తీస్తే ? కాస్త నా పేరు రాసుకుని ఇచ్చేస్తాలేరా !" అంటున్నానో లేదో, వీపుమీద ఛెళ్ళున కొట్టాడు నా చేతిలో పెన్నుకాస్తా దూరానపోయిపడింది.

"అమ్మోయ్ ! నాన్నోయ్ ! నా పెన్ను ముక్క వెరగ్గొట్టేశా డీ శీనుగాడు !" అన్నయ్య కేకలకు అమ్మా, నాన్నా ఇద్దరూ పరుగెత్తుకొచ్చారు.

"గాడిదా ! వాడి పెన్నుతో నీ కేం పనొచ్చిందీ ? అన్నీ కోతిపనులే !" నా చెవులు ఊడొచ్చేలా మెలితిప్పేశాడు నాన్న. పెద్దగా ఏడ్చాను నొప్పితో !

"అదుగో చేసే పని చేసేసి మళ్ళీ ఏడుస్తాడు కూటివెధవ. "అమ్మ నా నెత్తి చిల్లులుపడేలా మొట్టికాయలేస్తోంది.



"ఇం కెప్పుడూ నా పెన్ను తాకవు కదూ ?" అన్నయ్య అదుస్తున్నాడు.

"తియ్యనురా !" ఏడుస్తూ చెప్పాను. తలా, చెవ్వూ నొప్పెడుతున్నాయి.

"ఛాల్లే వెధవఏడుపూ నువ్వూ. ఫో అవతలికి !" నాన్న వెళ్ళిపోయారు.

"నీ పెన్నుకు వేరే ముక్క వేయిస్తారులే, నాన్నా ఏడవకు." అమ్మ అన్నయ్యను బుజ్జగిస్తోంది.

తమాషాగా లేమా ? ఇన్ని దెబ్బలు తిని నేను ఏడవకూడదు. పెన్ను తాకి తేనే నా కన్నీ దెబ్బలు! ఊరికే ఏడుస్తున్న అన్నయ్యను బుజ్జగిస్తున్నది అమ్మ అసలు అమ్మకూ నాన్నకూ పక్షపాతం. ఎన్ని తప్పులు అన్నయ్య చేసినా ఊరుకుంటారు. చెల్లాయి చేసినా పట్టించుకోరు. పైగా ఒక్కోసారి వాళ్ళిద్దరి తప్పులకూ నన్ను తంతారుకూడా. అందుకే చెల్లాయి కూ్కడా నేనంటే అలుసే! అది ఆటకు రమ్మంటే వెళ్లాలి; వద్దంటే ఊరుకోవాలి. లేకుంటే "అమ్మ, నాన్నలకు చెబ్తా రోయ్!" అంటుంది.

"చిన్న పిల్లని ఏడిపిస్తున్నావా ?" అని నా ఒళ్లు విరగ్గొడతారు వాళ్ళు. అందుకని చచ్చినట్టు వింటాను.

అమ్మకు నే నొక్కణ్ణీ బరువయ్యానుట అందుకని అమ్మమ్మగారి వూరు పంపించింది నన్ను. వాళ్ళూ అంతే. పిన్నీ, మామయ్యా, అమ్మమ్మా, అత్తయ్యా అందరూ నన్ను కొట్టడమే. అసలు 'శీను' అనే పేరు పోయి కోతి వెధవా, కొండముచ్చు వెధవా అనే పేర్లే స్థిరపడిపోయాయి. పిన్ని పిల్లలూ, మామయ్య పిల్లలూ అందంగా వుంటారుట...అందరూ కలసి నన్నే వెక్కిరిస్తారు. ఏ పిల్లలు తప్పు చేసినా నన్నే కొడతారు. అదేమంటే "ఇందుకేరా వెధవా! నిన్ను మీ అమ్మ ఇక్కడికి నెట్టేంది!" అంటారు. నాలుగునెలలు తిరక్కముందే మళ్ళీ పంపించేశారు అమ్మమ్మా వాళ్లూ నన్ను

ఇక అమ్మ నాన్నలకు మళ్ళీ నన్ను గురించి సమస్య తయారైందిట. అదేదో అనాధ పిల్లల శరణాలయమట అందులో నన్ను చేర్చాలనుకున్నారు ఒకరోజు...అమ్మ స్నేహితురాలెవరో ఒకావిడ...పేరు పార్వతట—ఆ శరణాలయంలో వుంటే. ఆవిడతో మాట్లాడాలని చెప్పి పంపింది అమ్మ. సాయంత్రం ఆవిడే వచ్చింది.

"ప్రతి ఒక్కరూ ఈ వెధవను చూచి 'ఇలాటి కురూపి ఎలా పుట్టాడని' అడుగుతూంటే, తల కొట్టేసుకోవాలని పిస్తోంది. "పార్వతీ! నువ్వెలాగూ చిల్డ్రన్స్ వార్డ్‌లోనే వుంటావుగా... వీణ్ణి అక్కడే పారేస్తాం...మీ శరణాలయం కోరినంతడబ్బూ చెల్లిస్తాం..." అమ్మ అలా చెప్పిందో లేదో పార్వతి అడ్డొచ్చింది.

"కళ్యాణీ! తల్లిగా నీ వనవలసిన మాటేనా ఇది ? తలిదండ్రు లిద్దరూ బ్రతికుండి, ధర్మబద్ధంగా మీ ఇద్దరికీ జన్మించిన మీ బిడ్డను...రూపం తక్కువని... అనాధ శిశు శరణాలయంలో పారేస్తారా? ఏ జన్మలో చేసిన పాపంవల్లో, నిశ్చింతగా తల్లిదండ్రుల వడిలో తలదాచుకోవలసిన బిడ్డలు, ఆ అనురాగానికి దూరమై, మా సంస్థలో పనిమనుషులు మొదలుకొని, మేనేజరువరకూ అందరిచేతా.

దెబ్బలతో, బహల్లతో, జవచ్చివాళ్లా బ్రతుకుతున్నారు. ఆ ఘోష చూశాక నేనూ త్వరలోనే రాజీనామా ఇచ్చేద్దామనుకుంటున్నాను. అలాటిది ఆ నరకంలోకి వీణ్ణి తోస్తావా?" అన్నది పార్వతి.

అమ్మకు కోపం వచ్చింది

"చాల్లేవే మహాచెప్పొచ్చావ్ నీతులు. నీకే ఇలాటి పిల్లాడు వుండివుంటే తెలిసేది..." అంది.

"ఇలాటి కురూపేకాదు, అవయవలోపాలున్న అవిటివాడైనా సరే, నేను ద్వేషించను. మనమే జన్మ ఇచ్చిన మన బిడ్డే మనకు కంటకమూ బరువూ అయితే, ప్రపంచానికంతటికీ వాడు బరువే అవుతాడు..." అన్నది పార్వతి.

"కురూపే కాదు పార్వతీ...కుళ్ళుగూడాను వీడికి..."

"కల్యాణీ! పసిపిల్లల హృదయాలు గులాబి పూలకంటే సున్నితమైనవి... మిగతా బిడ్డల్నొకమాదిరిగా, వీణ్ణొక రకంగా చూస్తారు. మీ దంపతులు... కాదనకు. లేకుంటే ఏ విషయంలోనయినా ఆ పిల్లలిద్దరూ నీకు భారంగా తోచలేదే? మీ ప్రవర్తనవల్లే వాడిలో మార్పు తెచ్చింది. లోలోపలే కుమిలి కుమిలి వాడికి మీమీదే కాకుండా, వాడి అన్న, చెల్లెలిమీదకూడా ద్వేషం ఏర్పడి వుండొచ్చు...అది వాడి తప్పు కాదు..."

పార్వతమ్మ వెళ్ళిపోయింది...కానీ అమ్మ కావిడ మాటలు నచ్చలేదల్లేవుంది; "పనిగట్టుక వచ్చింది నాకు బోధించటానిగ్గాబోలు..." అని చిరాకుపడిందికూడా.

అన్నీ వింటూంటే, చూస్తూంటే... ఎదురింటి తాతయ్యగారు ఓసారి వాళ్ళ మనవడికి కథ చెబుతుంటే విన్నాను... అది జ్ఞాపకం వస్తోంది ఆ కథేమిటంటే పూర్వం ఒక ముని యాగం చేస్తూ, బలి కోసం ఎవరినైనా బ్రహ్మచారిని పట్టుకు రమ్మని శిష్యులను పంపించాడట (అప్పుడు మనుష్యుల్ని యాగాలలో బలి ఇచ్చేవారటలే) అడవి మార్గాన ఒక బ్రాహ్మణ దంపతులు తమ ముగ్గురు కొడుకులతో వస్తుండటం శిష్యులు చూచారు. చాలా డబ్బు ఇస్తా మనేసరికి ఆ దంపతులు, ఆశపడి, ఒక బిడ్డను బలికి ఇవ్వటానికి ఒప్పుకున్నారు. "నాకు పెద్దవాడంటే వల్లమాలిన ప్రేమ; వాణ్ణి ఇవ్వను" అన్నాడు తండ్రి. "చిన్న పిల్లవాడు లేంది నేను బ్రతకలేను," అన్నది తల్లి. ఇద్దరూ కలిసి మధ్యవాడయిన రెండవవాణ్ణి (వాడి పేరేమిటీ? ఆ! గుర్తొచ్చింది-శునస్సేపుడు) బలికి తీసికెళ్ళమని ఇచ్చారట...

అలా వుంది నా కథ!

నేను అమ్మకు పనికిరాను, నాన్నకు పనికిరాను. ఇద్దరూ నన్ను అసహ్యించుకుంటారు. కొడతారు, తిడతారు. అది చూచి అందరూ నన్ను వెక్కిరిస్తారు.

మా అమ్మా, నాన్నా ఇలాగు అంటే మీరు నమ్మటంలేదుకదూ?

నే చెప్పేదంతా నిజం. మీరు నమ్మండి మానండి, నిజంగా నిజం.

అయితే ఎవరికీ పనికిరాని నేను ఇలా ఏడవాల్సిందేనా? అందరిచేతా దెబ్బలు తినాల్సిందేనా?

నేను నల్లగా, నా పళ్ళు ఎత్తుగా, నా కళ్ళు మెల్లగా, నేను అసహ్యంగా వుండటం నా తప్పా? మీరే చెప్పండి!